
కె. బాలగోపాల్

# దారి తప్పిన 'విచారణ'



సోమశేఖర కమిషన్ ఈ నెల 12వ తేదీన బెంగుళూరులోని ఒక న్యాయకళాశాలతో కలిసి నిర్వహించిన సెమినార్ జస్టిస్ సోమశేఖర వైఖరికి అద్దం పడుతుంది. వక్తలలో ఒకరు తప్ప అందరూ మత మార్పిడి అనేది సామాజిక శాంతికీ భద్రతకూ దేశ సమైక్యతకూ భంగకరం అనే మాట్లాడారు. దాదాపు 3 శతాబ్దాల మత ప్రచారం తరువాత కూడ దేశ జనాభాలో 3 శాతం దాటని క్రైస్తవాన్ని గురించి ఇంతటి ఆందోళన వ్యక్తం చేయడం కనీస విజ్ఞత గల అభిప్రాయమా అన్న సందేహం జడ్జిగారికిగానీ వక్తలకు గానీ రాకపోవడం హిందుత్వ వాదులు మెదళ్ల తలుపులు మూసేసే ద్వేష వాతావరణాన్ని దేశంలో ఎంతగా రెచ్చగొట్టారన్న దానికి సూచిక.

నిరుడు కర్ణాటకలో క్రైస్తవుల పైన దాడుల గురించి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఒక న్యాయ విచారణ కమిషన్‌ను నియమించింది. ఆ రాష్ట్ర హైకోర్టులోనూ మన హైకోర్టులోనూ కూడా జడ్జిగా పని చేసి రిటైరయిన జస్టిస్ బి. కె. సోమశేఖరను న్యాయ విచారణ కమిషనర్‌గా ఎంపిక చేసింది. ఆయనగారు ఆ విచారణను క్రైస్తవంపైన న్యాయ విచారణగా మలచి నడుచుకుంటున్న తీరు అపూర్వమని చెప్పుకోవాలి. జడ్జిగా ఉన్నప్పుడు సోమశేఖర గారు తన విధి నిర్వహణకు సంబంధించిన నియమాలను గాలికి వదిలాడన్న చెడ్డ పేరేమీలేదు. రిటైరయిన పిదప మన రాష్ట్రంలో ఏలేరు స్కాంపైన న్యాయ విచారణ జరపటానికి ఆయననే నియమించారు. కానీ మతం విషయానికొచ్చేసరికి అన్ని న్యాయ సంబంధమయిన నియమాలు మరిచిపోయాడు. బజరంగ్ దళ్, శ్రీరామసేన, హిందూ జాగరణ్ మంచ్‌లను బోను నుంచి తప్పించి ఏసుక్రీస్తును బోనులో నిలబెట్టి విచారణ చేస్తున్నాడు.

అధికార యంత్రాంగం వైఫల్యాలనూ లాలూచీని అవినీతినీ వెలికి తీయడానికి న్యాయ విచారణ కమిషన్లను కోరుకోవడం, నియమించడం జరుగుతుంటుంది. ఆ యంత్రాంగం తన వైఫల్యాలను గురించి తాను జరుపుకునే పరిశోధనలూ విచారణలూ విశ్వసనీయంగా ఉండవు. కాబట్టి వాస్తవాలు బయటకు రావాలంటే పారదర్శకమైన బహిరంగ విచారణ జరపాలన్న అభిప్రాయం దీనికి మూలం. న్యాయమూర్తిగా పని చేసిన వ్యక్తికి ఇందుకు కావలసిన నైపుణ్యం, దృష్టి కోణం ఉంటాయని ఆశించడం జరుగుతుంది కాబట్టి ఈ విచారణలను జడ్జిలుగా పనిచేసినవారికి అప్పగించడం జరుగుతుంటుంది. కర్ణాటక విషయానికొస్తే, 2006 నుంచి ఆ రాష్ట్రంలో క్రైస్తవుల పైన హిందుత్వవాద సంస్థలు చేస్తున్న దాడులను, వేధింపులను, అధికార యంత్రాంగం విచారించక పోగా తాను కూడ అందులో భాగం అయింది. పోలీసులే కాదు ఇతర పాలనా శాఖలూ అయినాయి. ప్రార్థనా స్థలాల పైన దాడి చేసి పాస్టర్‌ను కొట్టి కుర్చీలనూ చిత్ర పటాలనూ మత చిహ్నాలనూ ధ్వంసం చేసిన వారే పోలీస్ స్టేషన్‌కు పోయి అక్కడ బలవంతపు మతమార్పిడీ జరుగుతున్నదని ఫిర్యాదు చేస్తారు. హింసకు పాల్పడిన వారిపైన చర్య తీసుకునే బదులు పోలీసులు ప్రార్థనా స్థలాల నిర్వాహకులపైన శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారని కేసులు పెడతారు. ఒక్కొక్కసారి అరెస్టు చేస్తారు, ఒక్కొక్కసారి తాసీల్దారు వద్ద హాజరయి బాండు ఇమ్మని ఆదేశిస్తారు. జిల్లా అధికారులు చర్చిలను మూసివేసి తాళం వేసిన సందర్భాలూ అనేకం ఉన్నాయి. ఇదంతా రెండేళ్ళకు పైగా జరుగుతుండగా, నిరుడు ఆగస్ట్ 17, సెప్టెంబర్ 21 తేదీల మధ్య 28 చోట్ల దాడులు జరగడం, సెప్టెంబర్ 14న ఒక్కరోజే ఒకే సమయంలో ఒకే పద్ధతిలో దక్షిణ కన్నడ, ఉడిపి జిల్లాలలో 12 చోట్ల క్రైస్తవ ప్రార్థనా స్థలాల పైన 'జై శ్రీరాం', 'జై బజరంగ బలీ' అన్న నినాదాలు ఇస్తూ కర్రలు పట్టుకున్న గుంపులు దాడిచేసి విధ్వంసం చేయడం, వారిని నివారించని పోలీసులు ఆ తరువాత నిరసన తెలిపిన క్రైస్తవులను తరిమి తరిమికొట్టి అరెస్టు చేయడం, దేశమంతటి దృష్టినీ ఆకర్షించింది. న్యాయవిచారణ అంటూ జరిగితే ఇందులో అధికార యంత్రాంగం నిర్వాకం గురించి, యెడ్యూరప్ప ప్రభుత్వం స్పందన గురించి జరగవలసి ఉండింది. ఆ ప్రభుత్వం అధికార యంత్రాంగం వైఫల్యాలను వెలికి తీసే లక్ష్యంతో జస్టిస్ సోమశేఖర కమిషన్‌ను నియమించిందిగానీ, 2008 సెప్టెంబర్‌లో జరిగిన దాడులకు 'దారి తీసిన పరిస్థితుల' పైన కూడ విచారణ జరపమనింది. దాడులు జరుగుతున్నప్పుడు యెడ్యూరప్ప ప్రభుత్వం అనుసరించిన వైఖరిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఇది ఉద్దేశ్యపూర్వకంగా జరిగిందనే భావించాలి. సోమశేఖర గారు దానిని వాడుకొని న్యాయవిచారణను క్రైస్తవం పైన, మత స్వేచ్ఛపైన విచారణగా మలచారు. హిందుత్వ వాదులు విచారణ ముందు హాజరయి బైబిల్‌ను డాక్యుమెంటుగా ప్రవేశపెట్టి, తమపైన జరిగిన హింస గురించి వాంగ్మూలం ఇవ్వడానికి వచ్చిన క్రైస్తవులను బైబిల్ గురించి క్రాస్ ఎగ్జామిన్ చేస్తున్నారు. విగ్రహారాధనను విమర్శించే బైబిల్ వాక్యాలు హిందువుల మనోభావాలను కించపరిచేవిగా లేవా అనీ, హిందువుల పైన ద్వేషం రెచ్చగొట్టేవిగా లేవా అనీ, సామాజిక శాంతికీ, దేశ సమగ్రతకూ సమైక్యతకూ ఆ బైబిల్ వాక్యాలు అవరోధం కాదా అనీ ఎదురు ప్రశ్నలు అడుగుతున్నారు. 'అందువల్లనే దాడులు జరిగాయి' అనే నిర్ధారణకు న్యాయ విచారణ కమిషన్ రావడానికి తగిన 'మెటీరియల్' జస్టిస్ సోమశేఖర గారికి అందిస్తున్నారు. ఆయన తనకు పురమాయించబడ్డ కర్తవ్యానికి ఈ ప్రశ్నలు అసందర్భమైనవి అని వాటిని నివారించే బదులు ఆ ప్రశ్నలకు తావిచ్చే దిశగా తన విచారణ పరిధిని పెంచుకున్నాడు. ఆయనిచ్చిన అవకాశాన్ని పూర్తిగా వాడుకుంటున్న హిందుత్వ వాదులు బైబిల్‌లోని కొన్ని వాక్యాలను తొలగించవలసిందిగా ప్రభుత్వాన్ని ఆదేశించమని ఆయనను కోరారు. ఆయన ఆ అభ్యర్థనను కూడా పరిశీలిస్తున్నాడు.

సోమశేఖర కమిషన్ ఈ నెల 12వ తేదీన బెంగుళూరులోని ఒక న్యాయ కళాశాలతో కలిసి నిర్వహించిన సెమినార్ ఆయన వైఖరికి అద్దం పడుతుంది. న్యాయ విచారణ కమిషన్ అవగాహన పెంపొందించడం కోసం, విజ్ఞుల అభిప్రాయాలు వినడం కోసం ఈ సెమినార్ నిర్వహిస్తున్నట్టు కమిషన్ ఛైర్మన్ హోదాలో ఆయన ప్రకటించుకున్నాడు. సెమినార్‌లో ఆయనతో సహా పలువురు వక్తలు మాట్లాడారు. మొత్తం 6 ప్రసంగాలు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకటి మాత్రం ఆయనకు నిర్దేశించిన కర్తవ్యానికి సంబంధించినది ('మత మైనారిటీలకు చట్ట పరమైన రక్షణ'). తక్కిన అయిదు, 'మత ప్రచారంలో సామాజిక భద్రత', నైతికతలకు సంబంధించిన సమస్యలు', 'మతమార్పిడికి సంబంధించి ప్రస్తుతం ఉన్న చట్టాలు, వాటి సామాజిక ప్రభావం, ఏవయినా సవరణలు లేక కొత్త చట్టాలు అవసరమా?', 'మత మార్పిడి మత ద్వేషాలను రెచ్చగొట్టే నేరం కిందికి వస్తుందా?' 'మత మార్పిడి సామాజిక శాంతిని భగ్నం చేయడం అనే నేరం కిందికి వస్తుందా?' 'మతాన్ని విశ్వసించడం, ఆచరించడం, ప్రచారం చేయడం–వీటిలోని చట్ట పరమైన అంశాలు' అనేవి. వక్తలలో ఒకరు తప్ప అందరూ మత మార్పిడి అనేది సామాజిక శాంతికీ భద్రతకూ దేశ సమైక్యతకూ భంగకరం అనే మాట్లాడారు. దాదాపు 3 శతాబ్దాల మత ప్రచారం తరువాత కూడ దేశ జనాభాలో 3 శాతం దాటని క్రైస్తవాన్ని గురించి ఇంతటి ఆందోళన వ్యక్తం చేయడం –హక్కులు, న్యాయాన్యాయాల సంగతి అటుంచి–కనీస విజ్ఞత గల అభిప్రాయమా అన్న సందేహం జడ్జిగారికిగానీ వక్తలకు గానీ రాకపోవడం హిందుత్వ వాదులు మెదళ్ల తలుపులు మూసేసే ద్వేష వాతావరణాన్ని దేశంలో ఎంతగా రెచ్చగొట్టారన్న దానికి సూచిక. అదట్లా ఉంచి, మైనారిటీల పైన జరిగిన దాడుల విషయంలో అధికార యంత్రాంగం ప్రదర్శించిన నిర్వ్యాపకత్వం గురించి, లాలూచీ గురించి విచారణ జరపమని కూర్చో బెట్టిన కమిషన్ ఈ చర్చ చేపట్టడం సబబా అని జస్టిస్ సోమశేఖర గారికి సందేహం రాక పోవడం అత్యంత ఆందోళనకరం.

దావణగిరి జిల్లాలో అధికార యంత్రాంగం తాళాలు వేసిన క్రైస్తవ ప్రార్థనా స్థలాలను తెరిపించాలని కోరుతూ కొందరు క్రైస్తవులు సోమశేఖర కమిషన్‌ను అభ్యర్థించగా ఆయన జారీచేసిన ఆదేశం వారి కమిషన్ చేయబోయే న్యాయ నిర్ణయానికి అద్దం పడుతుంది. తాళాలు తీయడాన్ని తప్పక అనుమతించవలసిందేనని ఉపోద్ఘాతంలో అంటూ, దానికి ఆయన 19 షరతులు విధించాడు. ఇతర మతస్తుల భావాలను గాయపరిచే మాటలు మాట్లాడకూడదనీ, ఎటువంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడకూడదనీ, ప్రార్థనకు వెళ్ళే ప్రతి వ్యక్తీ తన పేరు, చిరునామా, ప్రార్థనా స్థలం పేరు దాని నిర్వాహకుల వివరాలు, ప్రార్థన సమయం వగైరాలన్నీ లిఖితపూర్వక వాంగ్మూలం రూపంలో అధికార యంత్రాంగానికి ఇచ్చి వెళ్లాలనీ వగైరా షరతులు పెట్టారు. అదృష్టవశాత్తు, వేరే కొందరు దావణగిరికి చెందిన క్రైస్తవులు అదే అభ్యర్థనతో హైకోర్టులో కేసు వేయగా హైకోర్టు అధికార యంత్రాంగాన్ని బాధితులకు కాక దాడిచేసిన వారికి అండగా ఉన్నందుకు అభిశంసించి, పోలీసులు సమర్పించిన నివేదిక ప్రకారమే బలవంతపు మతమార్పిడి జరిగిన ఆధారాలేమీ లేవని ప్రకటించి ప్రార్థనా స్థలాలను పోలీసు తాళాల నుంచి విముక్తం చేసింది.